క్లుప్తంగా

విశేషంగా తిరువీధి



సింహవల్లీ తాయారు అమ్మవారు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శుక్రవారం సింహవల్లీ తాయారు అమ్మవారికి తిరువీధి విశేషంగా జరిగింది. అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో అధిష్టంప జేసి ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు.

వైభవంగా నిత్యకల్యాణం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

కోలా గురువులుకు అభినందన



కోలా గురువులుకు అభినందనలు తెలుపుతున్న ముత్యాలు తదితరులు

పరవాడ: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థి, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులును ఆయన నివాసంలో శుక్రవారం ముత్యాలమ్మపాలెం మాజీ సర్పంచ్ చింతకాయల ముత్యాలు కలిసి అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చింతకాయల అమ్మోరు, మాజీ ఉప సర్పంచ్ మేరుగు చంద్రారావు, సూరాడ పెంటారావు ఉన్నారు.

అభాగ్యులకు ఆహార పొట్లాల పంపిణీ



యాచకులకు ఆహార పొట్లాలు అందజేస్తున్న కర్రిబాబు తదితరులు

సబ్బవరం: స్థానిక మదర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలు,దివ్యాంగులు,వృద్ధులు, యాచకులకు శుక్రవారం ఆహారం పంపిణీ చేపట్టారు.ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రిబాబు ప్రారంభించారు. సబ్బవరం,పెందుర్తి, చినముషిడివాడ,సుజాత నగర్,వేపగుంట,గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో ఆహార పొట్లాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ సత్యగంగరాజు,డైరెక్టర్ పి. శ్రీనివాసరావు,తారకేశ్వరి,జ్యోతి,సత్య,కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సర్వే రాళ్ల ఏర్పాటుకు చర్యలు

సబ్బవరం: రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా రీ సర్వే చేపడుతున్న గ్రామాల్లో సరిహద్దు రాళ్లు పాతేందుకు రెవెన్యూ,సర్వే సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఒక్కో రాయికి రూ.140 చొప్పున చెల్లించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని అనకాపల్లి జిల్లా సర్వే సహాయ సంచాలకుడు కట్టా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.ఆసక్తి కలిగిన వ్యక్తులు అధికారులను సంప్రదించవచ్చొన్నారు.

మహిళా ఉద్యోగులకు యోగా వర్క్‌షాప్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ మహిళా ఉద్యోగులకు శుక్రవారం యోగా వర్క్‌షాప్ నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ విమెన్ ఇన్ పబ్లిక్ సెక్టార్ (విప్స్) ఆధ్వర్యంలో ఎల్ అండ్ డీసీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంతర్జాతీయ యోగా నిపుణులు మన్సీ గులాటీ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడిలో ఉండే మహిళలకు యోగాభ్యసనం అవసరమన్నారు. ఈ సందర్భంగా ఆమె పలు యోగా భంగిమలు వివరించి, వచ్చిన వారితో ప్రాక్టీస్ చేయించారు. తొలుత కార్యక్రమాన్ని వి స్టీల్ మహిళా సమితి అధ్యక్షురాలు నుపుర్ భట్ ప్రారంభించారు. విప్స్ కో–ఆర్డినేటర్ కె. స్మిత చంద్రావత్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే భవన నిర్మాణాలు

- డీపీవో శిరీషారాణి
- పలు నిర్మాణాలు పరిశీలించి తొలగించాలని ఆదేశం



సబ్బవరంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఆర్ అండ్‌బీ స్థలంలో నిర్మిస్తున్న రేకుల షెడ్‌ను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి శిరీషా రాణి

సబ్బవరం: భవన నిర్మాణాలు చేపట్టేవారు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి ఆర్. శిరీషారాణి చెప్పారు. మండలంలోని సబ్బవరం,అమృతపురం గ్రామాల్లో శుక్రవారం ఆమె అధికారులతో కలిసి పర్యటించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను, ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను పరిశీలించారు. గ్రామ పంచాయతీల ద్వారా జి ప్లస్ టు భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారన్నారు. ఇప్పటికే పలు చోట్ల అదనపు అంతస్తులతో పాటు అనుమతులు లేకుండా పెంట్ హౌస్‌లు నిర్మించినట్లు గుర్తించామన్నారు. నిబంధనలు మీరి నిర్మాణాలు చేపట్టిన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సబ్బవరం పంచాయతీ ఈవో పర్యవేక్షణ లోపం ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ఇలాంటి విషయాల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. సక్రమంగా పని చేయని పంచాయతీ అధికారులకు మెమోలు జారీచేయాలని ఈవోఆర్‌డీ మహేష్‌ను ఆదేశించారు.

అక్రమ నిర్మాణాలను తొలగించండి

అమృతపురంలో ఒక యజమాని ఆర్ అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించి భవన నిర్మాణం చేపడుతున్నట్లు,సబ్బవరంలో మరో ఇద్దరు ఆర్ అండ్ బీ స్థలాన్ని ఆక్రమించి షెడ్లు నిర్మిస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని తెలిపారు.వాటిని పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్న పంచాయతీ కార్యదర్శులను సహించేదిలేదని హెచ్చరించారు. ఆమెతో పాటు ఎంపీడీవో రమేష్ నాయుడు, ఈవోఆర్‌డీ మహేష్, మండల పరిషత్ ఏవో ఎస్. బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



తానాంలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ దేవి

పరవాడ: తానాం గ్రామంలో కొలువైన పరదేశిమాంబ మహోత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రికెట్ టోర్నీని సర్పంచ్ కన్నూరు దేవి, మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు శుక్రవారం ప్రారంభించారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10వేలు, మూడో బహుమతిగా రూ.6 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నారు. తొలి రోజు మ్యాచ్‌లు ఉత్సాహంగా సాగాయి. కార్యక్రమంలో అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కన్నూరు వెంకటరమణ, ఎంపీటీసీ రొంగలి సునీత, నాయకులు రొంగలి గోపాలకృష్ణ, రొంగలి నాగేష్, సబ్బవరపు కృష్ణ, వసంతరావు, రొంగలి సూర్యనారాయణ, కట్టా సన్యాసిరావు, పైల అప్పారావు, సింగంపల్లి సన్యాసిరావు పాల్గొన్నారు.

బొగ్గు లారీలతో అవస్థలు

పరవాడ: హిందూజా పరిశ్రమకు వెళ్తున్న లారీల ద్వారా విడుదలవుతున్న ధూళిని అరికట్టడానికి చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడ మీదుగా పరిశ్రమకు రాకపోకలు సాగిస్తున్న బొగ్గు లారీల కారణంగా విపరీతమైన దుమ్ము, ధూళి ఎగసిపడుతుందని ఫలితంగా రోడ్లకు ఇరువైపులా నివాసం ఉంటున్న ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. రోడ్డు పక్కనున్న ప్రభుత్వ కార్యాలయాలు మసిబారిపోయాయన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి ధూళిని నివారించడానికి చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న సీఐ అశోక్‌కుమార్



పాల్గొన్న విద్యార్థులు

సింహాచలం: ట్రాఫిక్ నిబంధనలను విద్యార్థులు తప్పనిసరిగా తెలుసుకోవాలని ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. సరిపల్లి భాష్యం స్కూల్లో విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు స్కూల్‌కి వెళ్లి వచ్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కుటుంబ సభ్యులకు కూడా రోడ్డుపై ప్రయాణించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేయాలని సూచించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ నిషేధమని తెలియజేశారు. కార్యక్రమంలో పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్, భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: పాత విద్యుత్ స్తంభాలు, కండక్టర్ల మార్పు పనుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ గోపాలపట్నం ఏఈ డీవీఎల్ కుమార్ తెలిపారు. 98వవార్డు పరిధిలోని సింహపురికాలనీ, మైత్రీనగర్, జంగాల కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎఫ్‌డీఏ బృందం అమెరికన్ కార్నర్ సందర్శన



అమెరికన్ కార్నర్‌ను సందర్శించిన ఎఫ్‌డీఏ బృందంతో వీసీ ప్రసాదరెడ్డి తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని అమెరికన్ కార్నర్‌ను అమెరికాలోని ఎఫ్‌డీఏ డ్రగ్ క్వాలిటీ డివిజన్ డెరెక్టర్ డాక్టర్ కార్మిలో రోసాతో కూడిన ప్రతినిధుల బృందం శుక్రవారం సందర్శించింది. గతేడాది కాలంలో నిర్వహించిన కార్యక్రమాల వివరాలను కేంద్రం సమన్వయకర్త ఆచార్య జేమ్స్ స్టీఫెన్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, యూఎస్ కంజ్యూమర్ సేఫ్టీ ఆఫీసర్ సలీమ్ అక్తర్, సీనియర్ పాలసీ అడ్వైజర్ బ్రూక్ హిగ్గిన్స్, ఓఆర్ఏ నేషనల్ ఎక్స్‌పర్ట్ జోన్ మెలెంజ్, ఆచార్య వై.రాజేంద్రప్రసాద్, డీన్ ధనుంజయరావు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉద్యోగం

అక్కిరెడ్డిపాలెం: డిగ్రీ పాసైన నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు బొల్లినేని మెడ్‌స్కిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. హెల్త్ కేర్ బిల్లింగ్, హాస్పిటల్ ఫ్రంట్ డెస్క్ కో–ఆర్డినేటర్, పేషెంట్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని చెప్పారు. 20 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు గలిగి, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ నెల 27 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, శిక్షణ అనంతరం కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలియజేశారు. ఇతర వివరాలకు షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో నేరుగా లేదా 72079 53919, 76708 58199, 76809 45357 నంబర్ల ద్వారా ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు.

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో సబ్బవరం విద్యార్థుల సత్తా

వాతావరణ మార్పులపై ఏర్పాటు చేసిన ప్రాజెక్టుకు ప్రథమ స్థానం



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో అప్పలరాజు, హెచ్ఎం చిన్నమ్మాయి

సబ్బవరం: జిల్లా స్థాయి సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలో సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సీహెచ్ చిన్నమ్మాయి తెలిపారు. ఈ నెల 22,23వ తేదీల్లో అనకాపల్లిలో జరిగిన ప్రదర్శనలో పాఠశాల విద్యార్థులు తయారు చేసిన 'మోడల్ పర్యావరణం–వాతావరణ మార్పులు'కు సంబంధించిన కేటగిరిలో ఏర్పాటు చేసిన ప్రదర్శనకు ప్రథమస్థానం లభించిందన్నారు. ప్రాజెక్టుకు గైడ్ టీచర్‌గా ఆర్. ప్రసాద్, టీమ్ లీడర్‌గా విద్యార్థిని బి. మోన్షిత ఉన్నారన్నారు. ఈ నెల 27,28 తేదీల్లో విజయవాడలో జరుగనున్న రాష్ట్రస్థాయి సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారని తెలిపారు. అదేవిధంగా జిల్లా స్థాయి డ్రాయింగ్ పోటీల్లో కె కుసుమ ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో ఎస్. అప్పలరాజు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనడం ద్వారా వారిలో దాగి ఉన్న వినూత్న ఆలోచనలకు ప్రేరణ,సైన్స్‌పై మక్కువ పెరుగుతుందని తెలిపారు.

కబడ్డీ.. కబడ్డీ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు



రసవత్తరంగా సాగుతున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

సబ్బవరం: మండలంలోని తవ్వవానిపాలెంలో కొలువైన పరదేశిమాంబ పండగను పురస్కరించుకుని నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్ శుక్రవారం రసవత్తరంగా సాగింది. పోటీలను జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు ప్రారంభించారు. విజేతలుగా నిలిచిన జట్లకు వైఎస్సార్‌సీపీ నాయకుడు ,పారిశ్రామిక వేత్త బోకం శ్రీనివాస్ ఆర్థిక సాయంతో బహుమతులు అందజేయనున్నారు. ఇనిస్టేషన్ పోటీల్లో 12 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బోకం స్వామినాయుడు, మండల వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్ బోకం కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకులో రుణమేళా



మూర్తిని సత్కరిస్తున్న మేనేజర్ వాసు రామకృష్ణ, పలువురు బ్రాంచి మేనేజర్లు

సింహాచలం: యూనియన్ బ్యాంకు కల్పిస్తున్న సౌకర్యాలను ఖాతాదారులంతా సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశాఖ డిప్యూటీ రీజినల్ హెడ్ ఐఎస్ఎస్ మూర్తి తెలియజేశారు. సింహాచలం యూనియన్ బ్యాంకుశాఖలో శుక్రవారం రిటైల్ లోన్ క్రెడిట్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మూర్తి రుణ గ్రహీతలకు రుణ మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ వడ్డీకే రిటైల్ రుణాలు ఖాతాదారులకు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ రమేష్, సింహాచలం శాఖ మేనేజర్ పి.వాసు రామకృష్ణ, పలువురు బ్రాంచి మేనేజర్లు రమణరెడ్డి, చక్రవర్తి, చైతన్య రాణి, సుబ్బారావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూర్తిని బ్యాంకు సిబ్బంది, అధికారులు సత్కరించారు.

కార్మికుల పోరాటం అద్వితీయం

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు



దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సుదీర్ఘంగా పోరాటాలు చేస్తున్న కార్మికులు అభినందనీయులని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం జంక్షన్‌లో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారం నాటికి 743వ రోజుకు చేరుకున్నాయి. ఈ శిబిరంలో స్టీల్‌ప్లాంట్ ఎల్ఎంఎంఎం, ఎస్‌టీఎం విభాగాల ప్రతినిధులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను సమర్థిస్తున్న సమయంలో, కార్మికుల నుంచి ఇటువంటి ప్రతిఘటనను ఎదుర్కోవడం ఆ పార్టీ నేతలకు మింగుడుపడడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎలాగైనే విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయాలని చూస్తోందన్నారు. దేశంలో, రాష్ట్రంలో అన్ని రాజకీయ పక్షాలను ఏకం చేయడం ద్వారా, దానిని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ప్రతినిధులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, కె.సత్యనారాయణరావు, రామస్వామి, వై.టి. దాస్, సంపూర్ణం, సీహెచ్ సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులన్నీ అక్రమ, అనధికార కట్టడాలపైనే..

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ స్పందన



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న పట్టణ ప్రణాళికాధికారి సురేష్‌కుమార్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ అన్ని జోన్లలో చేపడుతున్న నిర్మాణాలపై పట్టణ ప్రణాళికా విభాగం శుక్రవారం స్పందన నిర్వహించింది. అక్రమ.. అనధికార కట్టడాలపైనే ఫిర్యాదులన్నీ వచ్చాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి బి.సురేష్‌కుమార్ ఫిర్యాదులు స్వీకరించారు. వాటి వివరాలిలా.. జోన్–1 నుంచి భీమిలి చిట్టివలసకు చెందిన జి.శ్రీనివాసరావు జోన్ పరిధిలో అక్రమ, అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేయగా.. భీమిలికి చెందిన ఎస్.ఆర్.రాజా సంగివలస అనిట్స్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. జోన్–3 నుంచి పాత రేసపువానిపాలేనికి చెందిన హితేష్‌కుమార్ జైన్ టీడీఆర్ సరిఫికెట్ కోసం, నక్కవానిపాలెంలో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని అదే ప్రాంతానికి చెందిన కర్రి గణపతి, శివాజీపాలెంలో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని పి.ఎల్.వి.ఎస్. మూర్తి, పెదవాల్తేరుకు చెందిన తెడ్డు శంకరరావు ఫిర్యాదు చేశారు. జోన్–4 నుంచి 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్ సూర్యాబాగ్ లైన్‌లో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని, ఎటువంటి సెట్‌బ్యాక్స్ లేకుండా నిర్మిస్తున్నారని, రెసిడెన్షియల్ ఏరియాలో కమర్షియల్ బిల్డింగ్స్ కడుతున్నారని ఫిర్యాదు చేశారు. జోన్–5 నుంచి సనపల నాగచంద్రుడు జోన్ పరిధిలో అక్రమ బిల్డింగ్ నిర్మాణాలకు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఎలా అనుమతులు ఇచ్చిందని, జోన్‌లో అక్రమ నిర్మాణాలు తొలగించాలని తాటిచెట్లపాలేనికి చెందిన చిల్లా వెంకటస్వామి, దయాల్‌నగర్ నుంచి జె భువనేశ్వరిదేవి జోన్‌లో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్య రత్నకుమార్, నరేంద్రనాథ్‌రెడ్డి, కె.పద్మజ, ఏసీపీలు, టీపీవో, టీపీఎస్‌లు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్ నిర్వాకం

హాల్ టికెట్లు అందక పరీక్ష రాయలేకపోయిన ఇద్దరు విద్యార్థులు



పరీక్ష కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పెదగంట్యాడ: ఓ ప్రైవేటు స్కూల్ నిర్వాకం ఇద్దరు విద్యార్థులకు శాపంగా మారింది. లక్షలాది రూపాయలు ఫీజులు చెల్లించినప్పటికీ ఆఖరి నిమిషంలో హాల్ టికెట్లు అందకపోవడంతో వారిద్దరూ పరీక్ష రాయలేకపోయారు. పెదగంట్యాడ వుడా కాలనీలోని టింపనీ స్కూల్ వద్ద శుక్రవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. భీమిలి క్రాస్ రోడ్డులోని ది హార్బర్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 43 మంది పదో తరగతి విద్యార్థులు సీబీఎస్‌ఈ పరీక్ష రాసేందుకు టింపనీ స్కూల్‌కు వచ్చారు. అందులో బొబ్బిలికి చెందిన బి.సాయి దుర్గ హర్షవర్ధన్, నర్సీపట్నానికి చెందిన సూరిశెట్టి తరుణ్‌లకు హాల్ టికెట్లు అందజేయకపోవడంతో పరీక్షా కేంద్రం నుంచి ఉసూరుమంటూ బయటకు వచ్చేశారు. వెంటనే సంబంధిత పాఠశాలను సంప్రదిస్తే పరీక్ష సమయానికి వస్తాయని చెప్పడంతో వారు వేచి చూశారు. ఎంత సేపటికీ హాల్ టికెట్లు రాకపోవడం, తోటి విద్యార్థులంతా పరీక్ష కేంద్రంలోకి వెళ్లడంతో కన్నీటి పర్యంతమయ్యారు. ఇది గమనించిన వారిద్దరి తల్లిదండ్రులతోపాటు మిగిలిన విద్యార్థుల పేరెంట్స్ ఆందోళనకు దిగారు. అక్కడికి వచ్చిన హార్బర్ స్కూల్ కరస్పాండెంట్ వైఎస్ నాయుడును నిలదీశారు. తమ పిల్లల భవిష్యత్తుతో ఆటలాడుకున్నారంటూ ఆవేదన చెందారు. సాంకేతిక కారణాల వల్లే ఆ ఇద్దరి విద్యార్థులకు సమయానికి హాల్ టికెట్లు ఇవ్వలేకపోయమని పాఠశాల యాజమాన్య ప్రతినిధులు చెప్పడంతో వారంతా ఆగ్రహానికి లోనయ్యారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. న్యూపోర్టు పోలీసులు పరీక్ష కేంద్రం వద్దకు చేరుకుని తల్లిదండ్రులకు నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.

బ్యాడ్మింటన్‌లో త్రిషాలీ, శ్రీకృష్ణకు స్వర్ణాలు



వితోలి బ్యాడ్మింటన్ విజేతలు

విశాఖ స్పోర్ట్స్: అమరావతి వీఐటీలో నిర్వహించిన వితోలి బ్యాడ్మింటన్ టోర్నీలో జి.త్రిషాలీ వుమెన్ సింగిల్స్‌లో విజేతగా నిలిచింది. ఫైనల్స్‌లో పి.వి న్నీ(కె.ఎల్.యూ)పై 21–8, 21–8 పాయింట్ల తేడాతో విజయం సాధించి స్వర్ణాన్ని అందుకుంది. మెన్ ఫైనల్ సింగిల్స్‌లో శ్రీకృష్ణ 2–0 సెట్ల తేడాతో యశ్వంత్ (కె.ఎల్.యూ)పై, డబుల్స్‌లో ఎ.రూపేష్‌తో కలిసి స్ట్రయిట్ సెట్లలోనే సుల్తాన్–ఆదిత్య(వీఐటీ)జోడీపై విజయం సాధించి స్వర్ణాలందుకున్నారు. గీతం విద్యార్థులైన వీరంతా నాలుగు కేటగిరీల్లో పాల్గొని మూడు పతకాలు సొంతం చేసుకున్నారు.

అప్పుల బాధ తాళలేక యువకుడి బలవన్మరణం



నీలి మోహనకృష్ణ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: అప్పుల బాధ తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఘటనకు సంబంధించి గాజువాక ఎస్ఐ ఎం.రవికుమార్, మృతుడి తల్లిదండ్రులు తెలిపిన వివరాలివి.. భెల్ టౌన్ షిప్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వర్తిస్తున్న నీలి భావనారుషి, పార్వతి దంపతుల కుమారుడు మోహన కృష్ణ (28). వీరు భెల్ టౌన్‌షిప్ క్వార్టర్ ఎఫ్ – 65లో నివాసం ఉంటున్నారు. మోహన కృష్ణ వ్యాన్ కొనుక్కుని, స్వయంగా నడుపుకొనేవాడు. ఈ క్రమంలో 69వ వార్డు తుంగ్లాంకు చెందిన వాకాడ శ్రీనివాసరెడ్డి వద్ద రూ.40వేలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చమని నిత్యం వేధిస్తుండటంతో, గురువారం అర్ధరాత్రి తల్లిదండ్రులు నిద్రిస్తున్న సమయంలో వేరే గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ ఎం.రవికుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అధిక వడ్డీలతో వేధింపులకు గురి చేస్తాడని శ్రీనివాసరెడ్డిపై ఎన్నో ఆరోపణలున్నాయని గ్రామస్తులు తెలిపారు. అతని వేధింపుల వల్లే తమ కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అందివచ్చిన కొడుకు తనువు చాలించడంతో వారు కన్నీటిపర్యంతమయ్యారు.

నైపుణ్యం ఉంటే అపార అవకాశాలు



ప్రొఫెసర్ సాంబశివరావును సత్కరిస్తున్న గైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్(విశాఖ ఉత్తర): విద్యార్థులు వారు చదువుతున్న కోర్సుల్లో నైపుణ్యం సాధించినప్పుడే ఉన్నత అవకాశాలు పొందుతారని ఇండియన్ సొసైటీ ఫర్ ట్రెనింగ్ అండ్ డెవలప్‌మెంట్(ఐఎస్‌టీడీ) జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.సాంబశివరావు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్)లో ఐఎస్‌టీడీ ఆధ్వర్యంలో శుక్రవారం నైపుణ్యాభివృద్ధిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐఎస్‌టీడీ గౌరవ కార్యదర్శి డాక్టర్ వై.హేమ విద్యార్థులకు ఐఎస్‌టీడీ స్టూడెంట్ చాప్టర్ విధివిధానాలను వివరించారు. స్టీల్‌ప్లాంట్ పూర్వ జనరల్ మేనేజర్ డాక్టర్ ఓ.రామమోహనరావు సాంకేతిక అంశాలపై ప్రసంగించారు. అనంతరం ప్రొఫెసర్ సాంబశివరావును సత్కరించారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌టెక్ సొల్యూషన్స్ సీఈవో పి.సునీల్, కాలేజీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, డి.దామోదరరావు, ఎస్.ప్రశాంతకుమారి, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలకు సర్దుబాటు కౌన్సెలింగ్

మహారాణిపేట: జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ(జీఎన్ఎం) ఉత్తీర్ణత సాధించి ఆక్సిలరీ నర్సింగ్ మిడ్ వైఫరీ (ఏఎన్ఎం)గా పనిచేస్తున్న వారికి శుక్రవారం సర్దుబాటు కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎంఈ, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమాసుందరి ఈ ప్రక్రియ చేపట్టారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మొత్తం 195 మందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొని పోస్టింగ్ ఉత్తర్వులు ఇస్తామని ఆర్డీ తెలిపారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్‌కు లేఖ రాస్తామన్నారు.